Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 08-07-2026

# వర్షాకాల వ్యాధుల నివారణకు సమష్టి చర్యలు తీసుకోవాలి

## సర్పంచ్ బిల్లా యాదగిరి



వేలేరు, (ఇది కద నిజం) జూలై 7: వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి సూచించారు. వేలేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ) లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేఘన అధ్యక్షతన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా,వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. దోమల నివారణ కోసం గ్రామపంచాయతీ తరఫున ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని, నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే గౌరవ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మండల కేంద్రంలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని, స్థల సేకరణ పూర్తైందని, త్వరలోనే శంకుస్థాపన నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఉపసర్పంచ్ శ్రీకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్, డాక్టర్ వైశాలి, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, కుమారస్వామి, ప్రభావతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గణప సముద్రం రిజర్వాయర్ పరిధిలో రెండు నెలల పాటు చేపల వేట నిషేధం

## జిల్లా మత్స్యశాఖ అధికారి వై.విజయ్ కుమార్



ఇది కద నిజం ఘనపురం మండలం గణప సముద్రం రిజర్వాయర్ పరిధిలో 2026 సంవత్సరం జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు వరదల నేపథ్యంలో చేపల పట్టడంపై ప్రత్యేక నియంత్రణలు, నిషేధం అమల్లో ఉంటాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి వై.విజయ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ప్రధాన జలాశయాల పరిధిలో వరదల కారణంగా చేపల వనరుల సంరక్షణ, చేప పిల్లల సహజసిద్ధమైన ఎదుగుదల,మత్స్య సంపద పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ మేరకు జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు గోదావరి జలాశయ పరివాహక ప్రాంతాల్లో చేపల వేటతో పాటు చేప పిల్లల సేకరణ, రవాణా, విక్రయాలపై పూర్తిగా నిషేధం విధించినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం విధించిన ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా అక్రమంగా చేపల వేటకు పాల్పడితే తెలంగాణ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ చట్టం--1976, సంబంధిత ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సంబంధిత మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సహకార సంఘాల ప్రతినిధులు, స్థానిక గ్రామస్థులు ఈ ప్రభుత్వ ఆదేశాలను కచ్చితంగా అమలు చేసి, జలాశయంలో చేపల వనరుల సంరక్షణకు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.ప్రస్తుత వర్షాకాలం, వరదల సమయంలో తీసుకునే ఈ ముందస్తు నియంత్రణ చర్యల వల్ల రాబోయే రోజుల్లో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని,తద్వారా మత్స్యకారులకు దీర్ఘకాలంలో అధిక ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని విజయ్ కుమార్ వివరించారు.

# రేగొండ చేనేత సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

## చైర్మన్‌గా పన్నాటి శ్రీనివాస్



భూపాలపల్లి రేగొండ ఇది కద నిజం

రేగొండ చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా (చైర్మన్‌గా) పన్నాటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రూపిరెడ్డిపల్లి గ్రామంలోని చేనేత సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆయన పేరును ప్రతిపాదించి ఆమోదించారు.దీంతో అధ్యక్ష పదవికి పన్నాటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రిలీఫ్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడిగా (వైస్ చైర్మన్‌గా) రాచర్ల రాజేందర్, కార్యదర్శిగా కూచన రాజ్ కుమార్, కోశాధికారిగా కొండా స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా పన్నాటి మార్కండేయ, మంతెన రవీందర్, ఆడెపు బాబు, పన్నాటి రమ, కూచన అరుణలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పన్నాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న చేనేత సంఘం సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, వారి అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. చేనేత రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి త్వరితగతిన పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి అందేలా చూస్తానని, కార్మికుల ఆర్థికాభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. చేనేత సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి, కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సంఘం సభ్యులు, చేనేత కార్మికులు, గ్రామ పెద్దలు శాలువాలతో ఘనంగా సన్మానించి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నారాయణగిరిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## -- ఉద్యమ ఆశయాల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని నాయకుల పిలుపు



**ధర్మసాగర్ (ఇది కద నిజం ) జులై 7:** ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు,కార్యకర్తలు అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి,ఉద్యమ పితామహుల సేవలను స్మరించుకుంటూ సామాజిక న్యాయం, సమాన హక్కులు,ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి గ్రామ కమిటీ అధ్యక్షుడు వక్కల అక్షిత్ మాదిగ అధ్యక్షత వహించారు. అధికార ప్రతినిధి చిట్యాల కృపానందం మాదిగ, ఉపాధ్యక్షులు వక్కల రుసన్ మాదిగ, కొలిపాక కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శి రాజారపు ప్రశాంత్,కమిటీ సభ్యులు, గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ఎమ్మార్పీఎస్ ఉద్యమం సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతుందని, ఉద్యమ ఆశయాలను ప్రతి ఇంటికీ చేరవేసి యువతను చైతన్యవంతం చేస్తామని తెలిపారు.గ్రామ స్థాయిలో సంఘటితంగా పనిచేస్తూ ఉద్యమ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకొని, ఉద్యమ విజయాలకు కట్టుబడి పనిచేస్తామని నాయకులు తెలిపారు.

# పారిశుద్ధ పనులు ప్రారంభించిన నల్లబెల్లి సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్



తెలుగు గళం న్యూస్ ఇది కద నిజం

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ఆధ్వర్యంలో పారిశుద్ధ పనులు ప్రారంభమయ్యాయి.వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలవకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని ప్రధాన మురికి కాలువల శుభ్రత పనులను సర్పంచ్ శ్రీకారం చుట్టారు. గతంలో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంత గృహాలు నీట మునిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ప్రధాన కాలువతో పాటు గ్రామంలోని వివిధ కాలువలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు.

3జమీలాభి, మాజీ ఉపసర్పంచ్ బిర్రు చంద్రయ్య, యువ నాయకుడు పొన్నం వేణు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన విద్యుత్ ఉన్నతాధికారులకు ఘన సన్మానం

హనుమకొండ ఇది కద నిజం

విద్యుత్ శాఖలో పదోన్నతులు (ప్రమోషన్లు) పొందిన ముగ్గురు ఉన్నతాధికారులకు గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఐబాబు సీజీఎం (ఆడిట్) గా,సత్యనారాయణ సీజీఎం (చీఫ్) గా, అనిల్ రెడ్డి జీఎం (ఆడిట్) గా పదోన్నతి పొందిన సందర్భంగా మంగళవారం హనుమకొండలో వారిని కలిసి ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కంపెనీ ప్రెసిడెంట్ హర్జీ నాయక్, కంపెనీ జనరల్ సెక్రెటరీ అజ్మీరా శ్రీరామ్ నాయక్ ల నేతృత్వంలో విద్యుత్ ఉద్యోగులు అందరూ కలిసి అధికారులకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, పదోన్నతులు పొందిన అధికారులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభ్యున్నతికి, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, వివిధ విభాగాల విద్యుత్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎస్పీ నచికేత్ ఆదేశాలతో కడపలో " స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో"




కడప, ఇది కద నిజం జూలై 7

జిల్లాలో ఎస్పి నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కొనసాగుతోన్న "స్టాప్,ఫేస్ వాష్ అండ్ గో " కార్యక్రమంలో జిల్లాలో రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా చేపట్టిన "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో " కార్యక్రమం కొనసాగుతోంది. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలలో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపుతున్నారు. లారీలు, కార్లు, వ్యాన్లు, బస్సులు, తదితర వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని డ్రైవర్లకు పోలీసు అధికారులు సూచించారు.

# కడప కేఎంసి నూతన కమిషనర్‌గా భవాని ప్రసాద్ బాధ్యతల స్వీకరణ..!

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిషనర్



కడప ఇది కద నిజం జూలై 7

కడప నగరపాలక సంస్థ కేఎంసి నూతన కమిషనర్‌గా పి. భవాని ప్రసాద్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వారి మార్గదర్శకాలను స్వీకరించారు. అనంతరం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనను కూడా

మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ.. కడప నగరాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన పౌర సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ నగరాన్ని మరింత పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తామని కమిషనర్ భవాని ప్రసాద్ పేర్కొన్నారు...

# ఎ.బి. క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభించిన మెట్ల

అమలాపురం ఇది కద నిజం జూలై 7

అల్లాడ భాష్యకారుల క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభించిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు

ఈ కార్యక్రమంలో అల్లాడ శరత్ బాబు, అల్లాడ అశోక్ వర్ధన్ ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మెట్ల రమణబాబు మాట్లాడు తూ ప్రతిష్ఠాత్మక లీగ్‌లో 24 జట్లు, 240 మంది ఆటగాళు పాల్గొంటున్నారు. మొత్తం 5 రోజుల పాటు జరిగే ఈ క్రికెట్ మహోత్సవం క్రీడాస్ఫూర్తి, ఐక్యత, యువతలో ప్రతిభను ప్రోత్సహించే వేదికగా నిలవనుందన్నారు.



